క్లుప్తంగా

ఆర్థికసాయం



ఆర్థికసాయాన్ని అందజేస్తున్న ఖాసింఖాన్

కడప కల్చరల్ : స్థానిక సాయిపేటలోని మహమ్మదుర్ రసూలుల్లా అనాథ శరణాలయానికి చాంద్‌బీ మెమోరియల్ ట్రస్టు చైర్మన్ లయన్ కె.ఖాసింఖాన్ ఆర్థికసాయాన్ని అందజేశారు. సోమవారం తనను కలిసిన శరణాలయ ప్రతినిధులు తాము నిర్మిస్తున్న శరణాలయ భవనాల కోసం విరాళం ఇవ్వాలని కోరారు. ఇందుకు స్పందించిన ఖాసింఖాన్ రూ. 50 వేలను శరణాలయ నిర్వాహకులు సయ్యద్ అబ్దుల్ రహిమాన్‌కు అందజేశారు.

ఆలయ హుండీ సొమ్ము లెక్కింపు



హుండీ సొమ్మును లెక్కిస్తున్న ధర్మకర్తలు, అర్చకులు

కడప కల్చరల్ : కడప నగరం దేవుని కడపలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయ హుండీలలోగల సొమ్మును సోమవారం లెక్కించారు. దేవాదాయశాఖ నుంచి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తనిఖీ అధికారిగా హాజరయ్యారు. కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్ ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ పి.పద్మాకర్, ధర్మకర్తలు, అర్చకులు పిచ్చయ్యమూర్తి, సుబ్రమణ్యం, జగన్నాథ, విజయ్‌కుమార్, సిబ్బంది సూర్యనారాయణ తదితరులు లెక్కింపులో పాల్గొన్నారు. జనవరి 18 నుంచి మార్చి 18వ తేది వరకు మొత్తం రూ. 35,877 లభించినట్లు ఈఓ శ్రీధర్ తెలిపారు.

నేడు సమావేశం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప బస్టాండులో ఖాళీగా ఉండే స్టాల్స్, షాపులను సీల్డ్ టెండరు ద్వారా భర్తీ చేసేందుకు నిర్ణయించామని, ఇందులో భాగంగా వ్యాపారులతో, ఔత్సాహితులతో మంగళవారం ఉదయం 11.00 గంటలకు కడప బస్టాండులో సమావేశాన్ని ఏర్పాటు చేశామని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వర్‌రావు తెలిపారు. ఈ అవకాశాన్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు వామపక్షాల సదస్సు

కడప వైఎస్ఆర్ సర్కిల్: పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కడప నగరంలో మంగళవారం నిర్వహిస్తున్న సదస్సును జయప్రదం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధమన్నారు. దేశంలో నివసిస్తున్న అన్ని వర్గాల ప్రజలు భారతీయులే అన్న విషయాన్ని గమనంలో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు చంద్రరెడ్డి, నాయకులు షాకీర్ హుస్సేన్, గౌస్ పీర్ పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి నాబార్డు సహకారం



సర్టిఫికెట్లను అందజేస్తున్న నాబార్డు ఏజీఎం విజయ్ విహారి

కడప కల్చరల్ : నాబార్డు సంస్థ మహిళల అభ్యున్నతికి, ఆర్థిక స్వాతంత్య్రం పొందేందుకు ఎంతో సహకరిస్తోందని ఆ సంస్థ ఏజీఎం విజయ్ విహారి అన్నారు. స్థానిక దాస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఓబుల దాస్ ఆధ్వర్యంలో 15 రోజులపాటు సంస్థ కార్యాలయంలో చిరుధాన్యాలతో ఆకర్షణీయమైన, ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహార పదార్థాలను తయారు చేయడంలో 30 మంది మహిళలకు శిక్షణ ఇచ్చారు. సోమవారం శిక్షణ ముగిసిన సందర్భంగా నాబార్డు అధికారి, శిక్షకులు వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టు ప్రశాంతి, నాబార్డు అధికారులు సురేష్ సహాయం, హరూన్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయి చదువు ఇంటికి వెలుగు

కడప ఎడ్యుకేషన్: అమ్మాయి చదువు ఇంటికి వెలుగని ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ షేకీలా బేగం పేర్కొన్నారు. కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రత్యేక ఎన్ఎస్ఎస్ పోగ్రాంలో భాగంగా సోమవారం నగరంలోని కో ఆపరేటివ్ కాలనీలో బేటి పడావో బేటీ బచావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మాయి చదువు ఇంటికి వెలుగు, అమ్మాయిలను చదివించండి, అమ్మాయిలను బతికించండి అంటూ నినాదాలు చేస్తూ వీధుల వెంట ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ గోవిందరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టండి

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



చింతకొమ్మదిన్నె : ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



చెన్నూరు : ప్రచారం నిర్వహిస్తున్న నరేన్ రామాంజనేయులురెడ్డి

చింతకొమ్మదిన్నె : రాష్ట్రంతోపాటు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి పాటు పడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం 18వ డివిజన్‌లో గల భాకరాపేట, విశ్వనాథపురం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను ఒక పేపర్‌లా కాకుండా ఖురాన్, బైబిల్, భగవద్గీత గ్రంథాల్లా ఆలోచించి రూపొందించడం జరిగిందన్నారు. గత ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాల్లో 99 శాతం పూర్తి చేసిన ఘనత మన రాష్ట్రంలో మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. తిరిగి ఈ సంక్షేమ పథకాలు అమలు కావాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి, మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, మండల మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, 18వ డివిజన్ నాయకుడు జిలానిబాషా, 16వ డివిజన్ ఇన్‌చార్జి నాగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, 17వ డివిజన్ కార్పొరేటర్ గుత్తిరెడ్డి చంద్రహాస్‌రెడ్డి, ఇన్‌చార్జి గుత్తిరెడ్డి లక్ష్మీరెడ్డి, మతి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ పథకాలు అందించడమే లక్ష్యం

చెన్నూరు : రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నా, ప్రతి ఇంటికీ పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందాలన్నా తిరిగి మనమందరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కమలాపురం శాసన సభ్యుడు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి తనయుడు పోచంరెడ్డి నరేన్ రామాంజనేయులురెడ్డి అన్నారు. చెన్నూరులోని చౌడమ్మ వీధిలో ఆయన తన తండ్రి ఎమ్మెల్యే అభ్యర్థి పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి అవినాష్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ ప్రభుత్వం తరఫున లబ్ధి జరిగి ఉంటేనే తనకు ఓటు వేయాలని చెబుతున్న దమ్మున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గతంలో 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు నాయుడు ప్రజలకు ఏమీ చేయలేదని విమర్శించారు. జన్మభూమి కమిటీలతో తన వారికి లబ్ధి చేకూర్చుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులు అయితే చాలు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. రాజకీయ అవసరాల కోసం ప్రజల్లోకి వచ్చి ఎన్నో దొంగ హామీలు ఇచ్చి మోసగించే వారి కన్నా, తను మేనిఫెస్టోలో ఏవైతే చెప్పడం జరిగిందో వాటిని అమలు చేసిన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. అక్కా, చెల్లెమ్మలు, అవ్వా తాతలు అందరూ దీవెనలు అందించి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. వైఎస్ఆర్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు అల్లి శ్రీరామమూర్తి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌పీఎస్ఆర్, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, రవిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఆర్ఎస్సార్, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాసరాజు, విజయ్, జగన్నాథం, పీసీ కేశవరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నకే ఓటేద్దాం

ఎన్నికల ప్రచారంలో డాక్టర్ రమ్యతారెడ్డి



బాలయ్యగారిపల్లెలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ రమ్యతారెడ్డి

పెండ్లిమర్రి : రాష్ట్రంలో ప్రతి ఇంటికి మేలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఓట్లు వేసి గెలిపిద్దామని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి కుమార్తె డాక్టర్ రమ్యతారెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం గొందిపల్లె గ్రామ పంచాయతీలోని గొందిపల్లె, బాలయ్యగారిపల్లె, నల్లయ్యగారిపల్లె, రామచంద్రాపురం, ఇందిరానగర్ గ్రామాల్లో ఆమె ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ ప్రభుత్వంలో అయితే మీకు మేలు జరిగిందో వారికే ఓటు వేయాలని సూచించారు. రాబోయే ఎన్నికలల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి పి.రవీంద్రనాథ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, జెసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, పొలతల చైర్మన్ నాగమల్లారెడ్డి, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజనేయరెడ్డి, ధనుంజయరెడ్డి, రామగంగిరెడ్డి, గంగిరెడ్డి, నరసింహరెడ్డి, బాబుల్‌రెడ్డి, సిద్దారెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన అభిరుచి అణువణువునా నింపుకోవాలి



సీఈఎస్‌పీ డీన్ ఆచార్య కృష్ణరాజ్‌ను సత్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ: పరిశోధన అభిరుచి గల పరిశోధకులే సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయగలరని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం వైవీయూలో ఎకనామిక్స్ శాఖ ఆధ్వర్యంలో ×సామాజిక శాస్త్ర పరిశోధకుల కోసం పరిశోధనా పద్ధతి, డేటా విశ్లేషణ₹ అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్కాలర్లు యాంత్రికంగా కాకుండా ఒక నిబద్ధతతో పరిశోధనలు సాగించాలన్నారు. అలా చేసినప్పుడే ఉత్తమ ఆవిష్కరణలతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మీ శాఖలు బలోపేతం కావాలంటే స్కాలర్ల పాత్ర కీలకమన్నారు. ఎకనామిక్స్ శాఖ విభాగాధిపతి ఆచార్య ఎం.అనిత మాట్లాడుతూ శాఖలో జరుగుతున్న పరిశోధనల గురించి వివరించారు. బెంగళూరు సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ అండ్ పాలసీ (సి.ఇ.ఎస్.పి) ఇన్‌స్టిట్యూట్ ఫర్ సోషల్ అండ్ ఎకనామిక్ చేంజ్ డీన్ ఆచార్య కృష్ణరాజ్ ×సామాజిక శాస్త్ర పరిశోధకుల కోసం పరిశోధనా పద్ధతి, డేటా విశ్లేషణ అన్న అంశంపై విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎకనామిక్స్ శాఖ సహ ఆచార్యులు డా. సుదర్శన్ రెడ్డి, డా. గణేష్ నాయక్, అధ్యాపకులు డా. రవి, డా. మహాలక్ష్మి, డా. బాలాజీ నాయక్, స్కాలర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి తప్పక పాటించాలి

- కడప ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్



మాట్లాడుతున్న ఆర్డీఓ మధుసూదన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎన్నికల ప్రవర్తనా నియమావళి తూ. చ. తప్పక పాటించాలని, సువిధ యాప్‌లో అనుమతులు తప్పక తీసుకోవాలని కడప ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలోని సర్ థామస్ మన్రో మీటింగ్ హాల్‌లో ఎన్నికల ప్రవర్తన నియమావళి, సువిధ యాప్‌పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీఓ మధుసూదన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గైడ్ లైన్స్ ప్రకారం రాజకీయ పార్టీలు, అభ్యర్థులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తప్పక పాటించాలన్నారు. రాజకీయ పార్టీలు తప్పనిసరిగా స్థానిక పోలీసు అధికారులకు తాము నిర్వహించే కార్యక్రమాల వేదిక, సమయాన్ని తెలియజేయాలన్నారు. ఊరేగింపులు ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది అభ్యర్థులు ఒకే మార్గంలో ఊరేగింపులను ప్లాన్ చేస్తే ఘర్షణ లేకుండా జరుపుకోవాలన్నారు. అభ్యర్థులు లేదా రాజకీయ పార్టీలు ఎంసీసీ ఉల్లంఘనను పరిశీలకుడికి నివేదించవచ్చన్నారు. పాలక పక్షం ప్రభుత్వ ఖజానా ఖర్చుతో ప్రకటనలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల ప్రకటన తేదీ నుండి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు మోడల్ కోడ్ అమలులో ఉంటుందన్నారు. ఈసీఐ సువిధ పోర్టల్ ద్వారా నామినేషన్ ఫారాలు, అఫిడవిట్‌లో వారి వ్యక్తిగత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి అభ్యర్థులకు సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మోడల్ ప్రవర్తనా నియమావళిపై గైడ్ లైన్‌లను ఖచ్చితంగా పాటించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులందరికీ ఖచ్చితంగా సూచించబడిందన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల ప్రవర్తన నియమావళి, సువిధ యాప్ పై వివరించారు.

ఈ కార్యక్రమంలో కడప డీఎస్పీ మహమ్మద్ షరీఫ్, కడప తహసీల్దార్ శివ ప్రసాద్, మున్సిపల్ కార్పొరేషన్ సిటీ ప్లానర్ జే సూర్య కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోలీస్, రవాణా శాఖ, ఆర్ అండ్ బి , ఎలక్ట్రిసిటీ, ఎయిర్ పోర్ట్ అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ క్యాంపులు



మిట్టమీదపల్లెలో చైతన్య కార్యక్రమం నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

వైవీయూ : కడప నగరంలోని పక్కీరుపల్లెలో నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపు ఉత్సాహంగా సాగుతోంది. క్యాంపులో భాగంగా సోమవారం నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి ఎం. మణికంఠ ఓటరు ప్రాధాన్యతను తెలియజేయడంతో పాటు వలంటీర్లు, గ్రామస్తులతో ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు.

మిట్టమీదపల్లెలో..

వైవీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్–4 ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా సోమవారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ డా. సునీత మాట్లాడుతూ సాంకేతిక పురోభివృద్ధి సాధించిన ప్రస్తుత తరుణంలో ఇంకా మూఢనమ్మకాలను నమ్మడం సరికాదన్నారు. అనంతరం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శాస్త్రీయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి బాలబయన్న, సమతా విభాగం అధ్యక్షురాలు సునీత, వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం



మృత్యుంజయ హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అగస్త్యేశ్వరాలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా లోక కల్యాణార్థం మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోక కల్యాణార్థం గణపతి, నవగ్రహ, ఉప దేవతా హోమాలు, మృత్యుంజయ హోమాలు వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతిగా హోమద్రవ్యాలు, పూజాద్రవ్యాలను అర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఇరగం మల్లీశ్వరి, న్యాయవాది ఈవీ సుధాకరరెడ్డి. కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం హుండీ ఆదాయం లెక్కించారు. రెండు నెలల్లో స్వామి, అమ్మవారికి భక్తులు రూ.1,35,126 కానుకగా సమర్పించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఏసీ, ఆలయ ఈఓ శంకరబాలాజీ, పర్యవేక్షణాధికారి పాండురంగారెడ్డి, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జగనన్న ముస్లిం మైనారిటీల పక్షపాతి



కువైట్లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఇలియాస్, బాలిరెడ్డిలను సన్మానిస్తున్న ప్రవాసాంధ్రులు

కడప కార్పొరేషన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీల పక్షపాతి అని వైఎస్సార్‌సీపీ గల్ఫ్, కువైట్ కన్వీనర్లు బీహెచ్ ఇలియాస్, ఎం . బాలిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కువైట్‌లోని ఫర్వానీయ ప్రాంతంలో ఉన్న నౌషాద్ హోటల్‌లో వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ సభ్యులు షేక్ గఫార్, షా హుస్సేన్, రహమతుల్లా, ఆబూతురాబ్, అఫ్సర్ అలీ, మహబూబ్ గారి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఇలియాస్, ఎం. బాలిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లింలంతా వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాక్ అధినేత హబీబ్ చెప్పలి, షేక్ గఫార్, షేక్ రహమతుల్లా , సయ్యద్ సదారుద్దీన్ ఖాద్రి, గల్ఫ్ కో కన్వీనర్ గోవిందు నాగరాజు, గల్ఫ్ సలహాదారులు యం. వి. నరసారెడ్డి, నాయని మహేష్ రెడ్డి, కడప, రాజంపేట, కోడూరు, రాయచోటి ముస్లింలు పాల్గొన్నారు.

అంజద్‌బాషా హ్యాట్రిక్ సాధించడం తథ్యం



అంజద్‌బాషాను సన్మానిస్తున్న బేడ, బుడగ జంగం నాయకులు

కడప కార్పొరేషన్: ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా కడప ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించడం తథ్యమని బేడ, బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు, వైఎస్ఆర్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి పస్తం అంజి అన్నారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో కడప నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడోసారి ఎంపికైన రాష్ట్ర డిప్యూటీ సీఎం అంజాద్ బాషాను ఆయన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య, ఎస్. సుబ్బారెడ్డి, యాసిన్‌బాషా, రాముడు, తులసికుమార్, ఆంజనేయులు, మంతయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

మిట్టమల్లేశ్వరుడికి వెండి పాత్ర సమర్పణ

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని శ్రీ మిట్టమల్లేశ్వరస్వామికి దాతలు కోనపురి రాము, సుగుణ దంపతులు సోమవారం 2 కిలోల వెండి దార పాత్రను బహూకరించారు. వారిచే ఆలయ అర్చకుడు రుద్రమూర్తి.. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. అనంతరం ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి వారికి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ రమణ, పాలక మండలి సభ్యులు మాధవాచారి, సోమేశ్వరమ్మ, మల్లికార్జున, రాజశేఖర్, చంద్రావతి, వాణి, సూర్యలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ‘పది’ పరీక్షలు ప్రారంభం



పెండ్లిమర్రి : పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ షరీఫ్

పులివెందుల టౌన్ : పులివెందుల క్లస్టర్ పరిధిలోని పులివెందుల, జమ్మలమడుగు, కమలాపురం నియోజకవర్గాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పులివెందుల పట్టణంలోని 9 కేంద్రాల్లో 1686 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఎంఈఓ రామానాయుడు తనిఖీ చేశారు. ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు పాల్పడకూడదని పేర్కొన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు.

సింహాద్రిపురం : జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో 100 మంది విద్యార్థులకు గాను ముగ్గురు గైర్హాజరయ్యారని, కేజీబీవీ సెంటర్‌లో 200 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓలు శ్రీనివాసులరెడ్డి, శారదా తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించినట్లు వారు పేర్కొన్నారు.

ఎర్రగుంట్ల : మండల వ్యాప్తంగా ఐదు కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. ప్రొద్దుటూరు డీవైఈఓ కృష్ణప్ప, డిప్యూటీ తహసీల్దార్ మాధవీలత, మండల విద్యాధికారి శివప్రసాద్ పర్యవేక్షించారు. రెగ్యులర్ విద్యార్థులు 818 మందికి గాను 817, ప్రైవేటు విద్యార్థులు 37 మందికి గాను 21 మంది హాజరు అయ్యారని వారు తెలిపారు.

చింతకొమ్మదిన్నె : మండల వ్యాప్తంగా 729 మంది విద్యార్థులకు గాను 716 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలు మండల పరిధిలోని శ్రీ చైతన్య క్యాంపస్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు.

వల్లూరు : మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో జరిగిన తెలుగు పరీక్షకు 365 మంది విద్యార్థులకు గాను 362 మంది హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇందులో గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో 248 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి వుండగా 245 మంది హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 117 మంది పరీక్ష రాయాల్సి వుండగా, 117 మంది హాజరయ్యారు.

చెన్నూరు : మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఆర్ఆర్ పాఠశాల కేంద్రాలలో మొత్తం 351 మంది విద్యార్థులకు గాను 344 మంది హాజరు కాగా, ఏడుగురు గైర్హాజరయ్యారు. ఆర్ఆర్ పాఠశాలలో 168 మంది విద్యార్థులకు గాను 167 మంది హాజరు కాగా, ఒకరు గైర్హాజరయ్యారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో 183 మంది విద్యార్థులకు గాను 177 మంది హాజరు కాగా, ఆరుగురు గైర్హాజరయ్యారు.

కమలాపురం : కమలాపురం పట్టణంలోని మూడు కేంద్రాల్లో మొదటి రోజు పరీక్షలు సజావుగా సాగాయి. నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ బేబి తెలిపారు. గురుకుల పాఠశాలలో 240 మంది విద్యార్థులకు గాను ఒకరు, జెడ్పీ బాలికల హైస్కూల్ కేంద్రంలో 143 మందికి గాను ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు. బాయ్స్ హైస్కూల్‌లో 159 మందికి గాను 100 శాతం విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాన్ని కడప డీఎస్పీ షరీఫ్ తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంత వాతవరణంలో జరిగేలా చూడాలని ఆయన పోలీసులకు సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. త్వరలో జరగబోయే ఎన్నికలల్లో ఎలాంటి అవాచనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు.

వైవీయూపరిధిలో ఒంటిపూట కళాశాలలు నిర్వహించాలి

వైవీయూ : ఎండతీవ్రత పెరిగిన నేపథ్యంలో యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలకు ఒంటిపూట తరగతులు నిర్వహించాలని ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) నాయకులు కోరారు. సోమవారం జీసీటీఏ ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా అధ్యక్షుడు డా. శశికాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డా. ఆర్. నీలయ్యలు వైవీయూలో వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్‌ను, సీడీసీ డీన్ ఆచార్య రఘుబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. అదే విధంగా నూతన విద్యావిధానంలో 75 శాతం మార్కులతో రీసెర్చ్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు నేరుగా పీహెచ్‌డీలో ప్రవేశం కల్పిస్తున్న నేపథ్యంలో ఎక్స్‌టర్నల్ ప్రాక్టికల్స్ నిర్వహించకపోవడం సరికాదన్నారు. దీంతో పరిశోధన సంపూర్ణం కాదని వారు పేర్కొన్నారు.

రక్తదానం

పులివెందుల రూరల్ : రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని రక్తనిధి మెడికల్ ఆఫీసర్ రేవతి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న ప్రతినిధి కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి రామ్‌లక్ష్మణ్‌రెడ్డి ఆధ్వర్యంలో యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తనిధి మెడికల్ ఆఫీసర్ రేవతి మాట్లాడుతూ రక్తదానంపై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలను కాపాడిన వారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు రాఘవేంద్రారెడ్డి, మణికంఠ, మోహన్‌రెడ్డి, పవన్, మస్తాన్, జయతేజరెడ్డి, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

20న ఆలయ వార్షికోత్సవం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని సుందరయ్య కాలనీ సమీపంలో వెలసిన శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానం పదో వార్షికోత్సవం ఈ నెల 20వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. ఈ మేరకు వేడుకల పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. అలాగే శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులందరూ పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

చెన్నూరు : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ పార్థసారథి అన్నారు. సోమవారం ఉదయం మండలంలోని ఉప్పరపల్లె (సమస్యాత్మకమైన) గ్రామపంచాయతీ, అలాగే కొక్కరాయపల్లెలో కేంద్ర బలగాలైన సశస్త్ర సీమాబల్ సిబ్బంది (ఎస్ఎస్‌బీ)తో కలిసి కార్డన్ సెర్చ్‌తోపాటు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు సమస్యాత్మకమైన గ్రామాలలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించడం జరుగుతుందన్నారు. వచ్చని గ్రామాలలో ఎలాంటి సమస్యలు పెట్టుకోకుండా అందరూ కలసిమెలసి అన్నదమ్ముల వల్లే ఉండాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. అలా కాకుండా ఇష్టానుసారుగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీలకు అనుమతి తప్పనిసరి

జమ్మలమడుగు : రాజకీయ పార్టీలు తమకు ఇష్టం వచ్చినట్లు ర్యాలీలు చేయడం కుదరదని, ముందస్తుగా అనుమతులు తీసుకుని రూట్ మ్యాప్‌ను సమర్పించిన తర్వాతే సాధ్యాసాధ్యాలను బట్టి అనుమతులు ఇవ్వడం జరుగుతుందని ఆర్డీఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తమ ప్రచారాలకు దేవాలయాలు, చర్చిలు, మసీదులను ఉపయోగించుకోకూడదన్నారు. పాఠశాలల్లోని ఆటస్థలం, మైదానంలో సమావేశాలు, బహిరంగ సభలను నిర్వహించుకోవడానికి ముందుగా పోలీసు అనుమతులు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీ కార్యాలయాలు పోలింగ్ కేంద్రానికి 400 మీటర్లలోపు దూరంలో ఉండకూడదన్నారు. పార్టీ కార్యాలయాల్లో ఇష్టం వచ్చినట్లు జెండాలు, ఫెక్సీలను ఏర్పాటు చేయరాదన్నారు. జెండాలు కూడా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మాత్రమే ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రచారానికి 18 ఏళ్లలోపు పిల్లలను ఉపయోగించుకోకూడదన్నారు.